క్లుప్తంగా

పార్కులో మాస్ క్లీన్ డ్రైవ్



పార్కులో క్లీనింగ్ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని రాంనగర్ పిల్లల పార్కులో సిబ్బంది, మెప్మా సభ్యులు మాస్ క్లీన్ డ్రైవ్‌ను చేపట్టారు. పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. గోదావరి ఘాట్‌లతో పాటు, మార్కెట్, బస్టాండ్, రైల్వే స్టేషన్ ఏరియాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కమిషనర్ కె.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.రాజమనోహర్, మేనేజర్ ఎస్.కరుణాకర్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, హెల్త్ అసిస్టెంట్ యండి ఇర్ఫాన్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

సాగునీటి వనరుల వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని సాగునీటి వనరుల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలని ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో) పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ చిన్న తరహా నీటి వనరుల గణనలో భాగంగా మంచిర్యాలలోని చెరువులకు సంబంధించి క్షేత్రస్థాయిలో వివరాలు, ఫొటోలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. అన్ని సాగునీటి వనరుల వివరాలను నమోదు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రెండు గ్రామాల మధ్య దూరంపై సర్వే



రోడోమీటర్‌తో దూరం కొలుస్తున్న అధికారులు

దండేపల్లి: మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామ పంచాయతీని విభజించి తప్పుడు నివేదికలతో వందుర్‌గూడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారని కోవ దౌలత్‌రావ్ మొకాశి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం వందుర్‌గూడ పంచాయతీ ఏర్పాటును పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దీంతో నెల్కివెంకటాపూర్ గ్రామ పంచాయతీ నుంచి వందుర్‌గూడ వరకు ఉన్న భౌగోళిక మధ్య దూరాన్ని ఎంపీడీవో ప్రసాద్ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఏఈఈ మహమ్మద్ ముఫీకుద్దీన్ అకీబ్ రోడోమీటర్ సాయంతో గురువారం సర్వే చేశారు. రెండు గ్రామాల మధ్య వాహనాలు వెళ్లే దారిని రోడోమీటర్ ద్వారా శాస్త్రీయంగా లెక్కించినట్లు ఎంపీడీవో తెలిపారు. నివేదికను సీల్డ్ కవర్ ద్వారా హైకోర్టుకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వందుర్‌గూడ గ్రామ పటేల్ కోవా బీర్షావ్ మొకాశి, నెల్కివెంకటాపూర్ మాజీ సర్పంచ్ భీమ్‌రావు, వందుర్‌గూడ ఆదివాసీ సేన అధ్యక్షుడు బాపురావు, నాయకులు, నెల్కివెంకటాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో సీఐ, ఎస్సై

లక్సెట్టిపేట: పట్టణంలోని తైక్వాండో స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతూ ఈ నెల 14న గద్వాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచ్ సుధాకర్ గురువారం తెలిపారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లోని రాయబేరిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన హర్షవర్ధన్, అభిజ్ఞ, ధీమాంత్‌రాజ్, హర్షన్, అనుశ్రీ, బానుప్రసాద్ క్రీడాకారులను స్థానిక సీఐ రమణామూర్తి, ఎస్సై గోపతి సురేష్ అభినందించారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్టీ కళాశాల బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా సిబ్బందితో కలిసి బాలురు ఆడిపాడారు. కార్యక్రమంలో ఎస్టీ వసతిగృహ నిర్వహకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

చినుకుపడితే నరకమే..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే బురదగా మారి అడుగుతీసి అడుగు వేయలేకుండా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని నూతన రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని గోపాల్‌వాడ ఫారెస్టు ఆఫీస్ ఏ క్యాబిన్ దగ్గర రైల్వే ప్రహరీని ఆనుకొని పెద్ద కాలువను ఆరు నెలల క్రితం తవ్వారు. డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో, తవ్విన కాలువలోనే నిలిచి, కాలువ నిండినప్పుడు రోడ్డుపైన పారుతోంది. కాలువను తవ్వినప్పుడు తీసిన మట్టిని, కాలువ పక్కనే కుప్పలుగా పోసి ఉంచడంతో రోడ్డు సైతం ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



ఆరు నెలల క్రితం తవ్విన కాలువ



రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు

నిలిచిన నీరు.. ప్రజలు బేజారు



చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాలలో సరైన మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు, ఇళ్ల నుంచి వచ్చే నీరంతా రోడ్డుపై నిలుస్తోంది. దీంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డు గుండా వెళ్లడం చాలా కష్టంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం

అప్‌గ్రేడ్ అయినా అవస్థలే..!

- ఇరుకు భవనంలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ కార్యాలయం
- ఆదాయం ఉన్నా మౌలిక వసతులు కరువు
- చిన్నపాటి వర్షాలకు బురదమయమవుతున్న ఆవరణ
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపల్ ఆదాయం రూ.కోటి డెబ్బై లక్షలు ఉన్నప్పటికీ ఇరుకు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. 2019లో గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 15వార్డులు, 25వేల జనాభా, 65మంది సిబ్బంది ఉన్నారు. భవనం చిన్నది, పాతది కావడంతో విధులకు ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డుకు దిగువన ఉండటంతో చిన్నపాటి వర్షానికే మున్సిపల్ ఆవరణ బురదమయంగా తయారవుతోంది. మరుగుదొడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు కూడా లేవు. మున్సిపాలిటీ వెనుక భాగానా పిచ్చిమొక్కలు పెరిగి, చెత్త చెదారంతో అస్తవ్యస్తంగా ఉంది. పరిశుభ్రంగా ఉండాలని ప్రజలకు చెప్పే మున్సిపల్ అధికారులు, వారి కార్యాలయంలో పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం లేదు. మురుగునీరు చేరి దోమలు వ్యాప్తిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను తొలగించే వాహనాలు 15ఉండగా తొమ్మిది చెడిపోయాయి. మరమ్మతుకు నోచుకోక పక్కన పడేయడంతో తుప్పుపడుతున్నవి. వార్డు సిబ్బంది పన్నెండు మందిని రెవెన్యూ శాఖకు తరలించడంతో వార్డు సిబ్బంది కొరత ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని పక్కా భవనం ఏర్పాటు చేసి, అన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంటుంది..



కార్యాలయంలో మౌళిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. పక్కా భవనం కోసం ఇప్పటికి ఎలాంటి అనుమతులు రాలేదు. సిబ్బంది ఇబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పక్కా భవనం ఉంటే బాగుంటుంది.

- విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్





పిచ్చిమొక్కలు, బురదతో మున్సిపల్ ఆవరణ

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- డీఈవో యాదయ్య



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో

భీమిని(కాసిపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. మండలంలోని గట్టుపల్లి, కేస్లాపూర్, వడాల, కేజీబీవీ ఆశ్రమ బాలికల పాఠశాలలను గురువారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ఎఫ్ఎల్ఎం, ఎల్ఐపీ అమలు విధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో కృష్ణమూర్తి, కేజీబీవీ ఎస్‌వో శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



స్వచ్ఛభారత్‌లో రఘునాథ్, నాయకులు



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: ప్రజలు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతోనే ఆరోగ్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని సేవ పక్షంలో భాగంగా గురువారం మంచిర్యాల నగరంలోని రాముని చెరువు కట్టపై బతుకమ్మ ఘాట్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్, వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని తొలగించి ఘాట్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో గాజుల ముఖేశ్ గౌడ్, పట్టి వెంకటకృష్ణ, రంగ శ్రీశైలం, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశా రు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు రాపర్తి వెంకటేశ్వర్, కేవీఎం శ్రీనివాస్, గర్రెపల్లి వెంకటనర్సయ్య, ఏతం శివకృష్ణలు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ యూనియన్‌కు పూర్తి సహకారం



రాథోడ్ బిక్కుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని టీఎన్జీవోస్ యూనియన్‌కు సహకార శాఖ తరుపున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని, టీఎన్జీవోస్ సభ్యులు అంతా సమష్టిగా కృషిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సహకార అధికారిని గురువారం టీఎన్జీవోస్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునీత, సురేందర్, హౌజింగ్ సొసైటీ సభ్యులు ప్రసాద్, రాజేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో సృజన

నెన్నెల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సృజన సూచించారు. ఆవుడం, చిత్తాపూర్ గ్రామంలోని పత్తి పంటలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. గులాబీ, రసంపీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. గొల్లపల్లి ప్రాంతంలో ఇప్పుడిప్పుడే పత్తి పంటకు అక్కడక్కడ పచ్చదోమ ఆశించినట్లు గుర్తించారు.

జీఎం కార్యాలయాల ముట్టడి విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణి వ్యాప్తంగా శుక్రవారం చేపట్టే జీఎం కార్యాలయాల ముట్టడి, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థలో వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 35శాతం లాబాల వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఅండ్ఎండీ స్ట్రక్చర్ మీటింగ్‌లో ఒప్పుకున్న అనేక పెండింగ్ సమస్యలను యాజమాన్యం అగ్రిమెంట్ చేయకుండా, సర్క్యులర్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నందునే సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టి యాజమాన్యం ఒప్పుకున్న సమస్యలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, ఫిట్ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు బొద్దుల వెంకటేష్, కృష్ణ చారి, శ్రీనివాస్, రాజకొమురయ్య తదితరులున్నారు.

23న కవిత రాక

శ్రీరాంపూర్: హెచ్ఎమ్మెస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 23న శ్రీరాంపూర్‌కు రానున్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో హెచ్ఎమ్మెస్, సింగరేణి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నారు. ఓ కార్మికుని ఇంట్లో బతుకమ్మ పేర్చి వేడుకల్లో పాల్గొననున్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

క్రీడలకు పెద్దపీట



క్రీడా దుస్తులు అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో గురువారం క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఏరియా వార్షిక క్రీడల్లో భాగంగా ఇక్కడ జరుగుతున్న రోజువారి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు వీటిని పంపిణీ చేశారు. కంపెనీ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. మంచిర్యాలలో పీడీఎస్‌యూ(విజృంభణ) జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు పీడీఎస్‌యూ (విజృంభణ) పోరాడుతుందన్నారు. గురుకులాలకు పక్కాభవనాలు నిర్మించాలన్నారు. శాస్త్రీయ విద్య విధానం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అడహక్ కమిటీ ఎన్నిక..

పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్‌గా మహేష్, కో-కన్వీనర్లుగా కార్తీక్, జ్ఞానేశ్వర్, కమిటీ సభ్యులుగా సాయి, చందర్, రజనీకాంత్, విఘ్నేష్, ఆదిత్య ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకుడు రాజ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, కార్యదర్శి పోచమల్లు, పీవోడబ్ల్యూ (స్త్రీ విముక్తి) జిల్లా కన్వీనర్ లావణ్యలు పాల్గొన్నారు.

• రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు మంచిర్యాల ఆటోనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పిలుపు మేరకు రక్తదాన శిబిరంలో తమ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు వారి సహకారంతో రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిపారు.

• కళ్లకు గంతలతో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: సంచార కులాల డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కర్రె లచ్చన్న, చెలిమెల అంజన్న, బీంసేన్, అశోక్, సతీష్, చంద్రమౌళి, నర్సయ్య పాల్గొన్నారు.

• పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: తాండూర్ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ లలితకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలపై విచారణ చేపట్టి గుర్తింపు రద్దు చేయాలని టీవీవీ, వీజేస్, ఎన్ఎస్ఎఫ్, బీసీఎఫ్ఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, గోపాల్, సల్మాన్, నితీష్ కోరారు.

• అవగాహన

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం అంగన్ వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. చిన్నారులకు, బాలింతలకు రావాల్సిన పోషణ సామగ్రిని అందజేశారు. పిల్లల బరువు ఎత్తు, తల్లులకు పిల్లల ఎదుగుదలను అంచనా వేయడం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మమత, నవ్య, మార్తా, ఏఎన్ఎంలు ప్రియదర్శిని, వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• సీపీఎం మండల మహాసభ

చెన్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎరువులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. స్థానిక తాపీ మేస్త్రీ సంఘ భవనంలో గురువారం సీపీఎం మండల మహాసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి మహిళలు, రైతులు ఎరువుల కోసం తండ్లాడుతుంటే పట్టించుకున్న పాపన పోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారని, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కరిమా, బొడెంకి చందు, పాయిరాల రాములు, నాగజ్యోతి, సరిత, నగేశ్, అనిల్, కృష్ణమాచారిలు పాల్గొన్నారు.

• చింతపల్లిలో పశువైద్య శిబిరం

దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు. 257పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. పశువుల యజమానులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అంజుమ్, ప్రభుకుమార్, ఇందిర, శిరీష, స్వప్న, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

• 48మందికి వైద్య పరీక్షలు

తాండూర్: తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ సభ్యులతో పాటు పలువురికి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 48మందికి మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు.

• 'యూరియా కోసం ఆందోళన చెందొద్దు'

దండేపల్లి: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని దండేపల్లి ఏవో అంజిత్‌కుమార్ అన్నారు. దండేపల్లి మండలంలో గురువారం 103మెట్రిక్ టన్నుల యూరియాను సహకార సంఘాలు, రైతువేదికల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 200టన్నులకు గాను ప్రణాళిక పంపించినట్లు, రెండు మూడు రోజుల్లో రాగానే వాటిని కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

ప్రభుత్వం మేదరులకు చేయూతనందించాలి

- ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



మాట్లాడుతున్న సూరినేని కిషన్

పాతమంచిర్యాల: మేదరి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదరులను ప్రభుత్వం ఆదుకోవాలని (మహెంద్ర)మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు సూరినేని కిషన్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని (మహెంద్ర)మేదరి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేదరులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. అటవీ ప్రాంతాల్లో వెదురు పెంపకం చేపట్టి సరఫరా చేయాలని, మేదరులకు వృత్తి శిక్షణ నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వెదురు వస్తువులు, కళాకృతుల తయారీపై శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో (మహెంద్ర)మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిజుట్టు శుభాష్, కోశాధికారి సత్తయ్య, ప్రచార కార్యదర్శి అమరనాథ్, ఉపాధ్యక్షుడు రాపాల తిరుపతి, మంచిర్యాల మండల ప్రధాన కార్యదర్శి కనకయ్య పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై అవగాహన

మందమర్రిరూరల్: ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో గురువారం బీఎల్‌వోలకు స్పెషల్ ఇన్సెంటివ్ సర్వే (ఎస్ఐఆర్) పై తహసీల్దార్ సతీష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ గణపతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కాసిపేట: మండలంలోని 20మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మైదం రమేశ్, గోలేటి స్వామి, గడ్డం పురుషోత్తం తదితరులున్నారు.